అందరూ
అసహ్యించుకునే
శనిదానం తీసుకునే
అతనేం చేసాడు?

**పెనుమాక నాగేశ్వర శాస్త్రి కథ**

# అనుగ్రహం

వర్షం... వర్షం... వర్షం... ధారాపాతంగా మూడు రోజుల్నుంచి ఒకటే వర్షం. రోడ్లన్నీ జలమయం. పల్లపు ప్రాంతాల్లోని గుడిసెలన్నీ నీట మునిగినయ్. నీరు కాలువల్లా ప్రవహిస్తున్నయ్. రోడ్లన్నీ సందడి లేకుండా ఉన్నయ్. వ్యాపారస్థులంతా కొట్లు తెరుచుకుని బేరాల్లేక అచేతనంగా కూచుని కురిసే వానని కసిదీరా తిట్టుకుంటున్నారు. పిల్లలకు బడికి వెళ్ళే యాతన తప్పింది కాని పెద్దలకు మాత్రం ఆఫీసులకు వెళ్ళక తప్పలేదు. అందుకే వానయినా వంగిడయినా వేళకింత గతికి ఆఫీసులకు వెళ్ళే ప్రయత్నాల్లో వున్నారు మగవారు. వారికి వండి వడ్డించే హడావిడిలో ఆడవారు అగచాట్లు పడుతున్నారు వర్షపు చిత్తడికి. పిల్లలు మాత్రం వర్షం నీళ్ళల్లోకి కాగితం పడవలు వదిలి వినోదిస్తున్నారు. వాళ్ళ సంతోషం వారిది. వాళ్ళ ప్రపంచం ప్రత్యేకం. ఆకలి వేసినప్పుడు తినటం, కేకలు వేసినప్పుడు ఏడ్వడం, ఆడుకోవటం, ఆనందించటం తప్ప మాయ మర్మం, ఈర్ష్య, ద్వేషం వగైరాలు ఎరుగని నిష్కపటమైన దశ బాల్యం.

ఆఫీసుకు వెళ్ళేందుకు సిద్ధమవుతున్న కొడుకు గోపాలాన్ని వంటగదిలో పనిలో మునిగి తేలుతున్న కోడలు ప్రభావతిని, కొట్టుకుంటూ, తిట్టుకుంటూ ఆడుకుంటున్న మనుమల్ని మౌనంగా గమనిస్తూ వరండాలో వాలుకుర్చీలో పడుకున్నాడు నీలకంఠశాస్త్రి.

తిండి కలిగితె కండ కలదోయ్... కండ కలవాడేను మనిషోయ్ అన్న గురజాడ వారి మాట ప్రకారం నీలకంఠశాస్త్రి మనిషి



కానేకాదు. కష్టాలు మనిషికాక మానులకొస్తాయా అని ఆలోచిస్తే మాత్రం శాస్త్రి తప్పకుండా మనిషే.

"ఇంట్లో తినడానికయితే అందరూ వున్నారు. పనికిమాత్రం ఒక్కళ్ళూ ఉపయోగపడరు. ఈ వర్షానికి ఇంటిముందుక్కు ఏ కూరలబండి వాడు వస్తాడు. అలా వీధిలోకి వెళ్ళి ఏదైనా తెద్దామనే ఆలోచన

ఒక్కరికీ రాదు. ఆలోచన వచ్చినా అడుగు బయట పెట్టడానికి బద్ధకం. చినుకు మీదపడితే మొక్క మొలిచిపోతామని భయం పాపం. తినేందుకు మాత్రం రకరకాలు కావాలి కంచంలోకి... వెధవ సంత... వెధవ సంతని'' వంట గదిలోనుంచి కోడలి సతాయింపు.

''ఇంత వర్షంలో వీధిలో మాత్రం కూరలమ్ముకుంటూ ఎవరు కూర్చుంటార్లెద్దూ. ఒకవేళ వున్నా ఎలా వెళ్ళడం. ఈ పూటకి ఏదోటి చేసెయ్, సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు మార్కెట్‌కు వెళ్ళి కూరలు తెస్తాన్లే, కాస్త శాంతించు'' కోడలి సతాయింపునకు కొడుకు సముదాయింపు.

ఆవిడగారి సతాయింపంతా తనపైనే అని తెలుసు నీలకంఠశాస్త్రికి. ఇది ఈ ఒక్క రోజుదీ కాదు. రోజూ ఏదోక వంకతో వుండేదే. కొడుకు ఇంట్లో వున్నంతసేపూ పరోక్షంగానూ, అతడు అడుగు అవతల పెట్టింది మొదలు ప్రత్యక్షంగానూ ఈ సతాయింపులు, సాధింపులు చాలాకాలంగా శాస్త్రి అనుభవిస్తున్నవే. ఈ వేధింపులన్నీ అలవాటయినవే. బ్రతికినంతకాలం భరించాల్సినవే. అంతకుమించి ఆయన చేయగలిగిందేముంది కనుక. చేయగలననే ధైర్యం, చేయగల శక్తి, నమ్మకం వున్నరోజుల్లోనే, ఒంట్లో ఓపిక ఉన్న ఆ రోజుల్లోనే ఏమీ చేయనివాడు, ఇక ఇప్పుడేం చేయగలడు. అందుకే అన్నింటిని మౌనంగా భరిస్తూ కాలం దొర్లించటం అలవాటు చేసుకున్నాడు శాస్త్రి. ఆయనకు తెలుసు. తన మౌనం ఆమె కోపాన్ని మరింత పెంచుతుందని. కానీ నిస్సహాయుడు.

తాతతండ్రుల కాలంలో వున్న అష్టైశ్వర్యాల మూలంగానూ, లేక లేక ఆరుగురు ఆడపిల్లల తర్వాత పుట్టిన మగపిల్లవాడు కావటం వల్లనూ తల్లితండ్రులు అతి గారాబంగా పెంచారు శాస్త్రిని. కాలు కింద పెడితే కందిపోతాడేమోనన్నట్లు ఒకరు దింపితే ఒకరు చంకకేసుకుని ముద్దులు కురిపిస్తూ పెంచి పెద్దచేశారు. తను ఆడింది ఆట, పాడింది పాట. బడికి వెళ్తానంటే వెళ్లమనేవారు, వెళ్లనంటే మానమనేవారు. పిల్లవాడు కళ్ళముందు కదలాడితే చాలునని సంబరపడ్డారు. అతను చేయదలుచుకున్న పనికి, అనదలుచుకున్న మాటకు అడ్డం, అభ్యంతరం వుండేవి కావు. అతని ఆగానికి, అల్లరికి అంతం ఉండేది కాదు. తోటి వయసు పిల్లలందరూ బుద్ధిగా పుస్తకాలు పుచ్చుకుని బడికి వెళ్తుంటే తనుమాత్రం నాయనమ్మను నానారకాలుగా ఆటలుపట్టిస్తూ ఆనందపడిపోయేవాడు. ఇంట్లో తినడం వీధిలో ఎగరటం, పెద్దవాళ్లని, ఎగర్తించటం ఎగతాళి చేయడం, అలకలు, అల్లరి లాంటి పోకిరీ చేష్టల్తోనే రోజులు గడిచిపోయనై. మందలింపనే మాట మచ్చుకైనా రుచిచూసి ఎరుగడు శాస్త్రి.

ఆరుగురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు, పురుళ్ళు, అతిథి మర్యాదలు, అటుతర్వాత తాతయ్య, నాయనమ్మల అంత్యక్రియలు వగైరా వగైరా అవసరాలకి, భేషజాలకి ఆస్తంతా హారతి కర్పూరంలా హరించుకుపోసాగింది. చెట్టంత ఎదిగినా చేతికందిరాని

అప్రయోజకుడయ్యాడు శాస్త్రి.


చదువు అబ్బకపోయినా చెడు సహవాసాలు, వ్యవసాలు అలవడినై. కొడుకు చేతికంది రాకపోగా చెడిపోయాడని ఆలస్యంగా తెలుసుకున్నారు తల్లితండ్రులు. పరువు, మర్యాద, కుటుంబ గౌరవం లాంటి అర్థంలేని వ్యర్థపు ఆలోచనలతో వాళ్లల్లో వాళ్లే కుమిలిపోయారు. కొడుకును గూర్చిన దిగులుతో కృంగికృశించారు.

చదువు ఎటూ ఒంటబట్టలేదు. వారి వృత్తి అయినా పౌరోహిత్యమయినా నేర్చుకుని బ్రతకమని చెప్పి కొడుకుని ఒప్పించటానికి శతవిధాల ప్రయత్నం చేసి విఫలుడైనాడు శాస్త్రి తండ్రి. తినటం, తిరగటం తప్ప పని చేయటానికి మాత్రం ఒళ్ళు వంగలేదతనికి.

పొద్దస్తమానం పనిలో మునిగితేలుతూ వుండేవారు కొందరయితే, చేయవలసిన పనులెన్నివున్నా చేయి కదిలించటం ఇష్టం లేని వారు కొందరు. పనీపాట లేకుండా తిని తిరగడం అలవాటయితే ఇక ఏ పనీ చేయబుద్ధి పుట్టదు. సోమరితనం అనేది ఓ భయంకరమైన జబ్బు. అది రాకూడదే గానీ, వస్తే మాత్రం వదలదు. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే విశ్రాంతిని పొందవచ్చును. అలా పనిచేయడంలో ఎంతో హాయి, తృప్తి, ఆనందం, ఆరోగ్యం వున్నాయనే విషయం శాస్త్రి లాంటి సోమరులకు తెలియదు. తెలుసుకోలేరు.

"తాయ్యా అమ్మ అన్నానికి రమ్మంటుంది" చెప్పి ఆటల్లోకి పరుగెత్తాడు మనుమడు.

కాళ్ళు కడుక్కుని భోజనం ముందు కూర్చున్నాడు శాస్త్రి. ప్రతిరోజూ చేసిన పదార్థాలేవో కంచంలోపెట్టి, అవసరమైన వాటిని ఆయనకు అందుబాటులో వుంచి వేరేగదిలోకి వెళ్ళి పడుకుంటుంది కోడలు. ఇలా ఒంటరిగా కూర్చుని సయించినమటుకు తినిలేవడం మామూలయిపోయింది.



కంచంలో కందిపొడి, నాలుగు ఒడియాలు, ఆవకాయ వేసి అన్నం పెట్టి వెళ్ళింది. ఒడియాలు నమిలేందుకు పళ్ళు స్వాధీనంలో లేవు. ఆవకాయ తింటే వేడిచేసి రాత్రయ్యే సరికి రకరకాల బాధల్తో అవస్థ పడాల్సొస్తుంది. బిరుసుగా వున్న అన్నంలోకి నెయ్యిలేకుండా కందిపొడి కలుపుకు తింటే నోటికి ఎలా హితవుగా ఉంటుంది. బాగున్నా బాగుండక పోయినా, ఇష్టమైనా, అయిష్టమైనా ఆ నాలుగు ముద్దలు తిని ప్రాణం నిలబెట్టుకోవటమే అవుతున్నది ఏ రోజయినా. తనకు ఇష్టమైన పదార్థాలు తయారుచేయడానికి, కొసరి కొసరి వడ్డిస్తూ ఆప్యాయంగా మాట్లాడుతూ దగ్గర కూర్చుని ఆదరణగా అన్నం పెట్టే ఆత్మీయులు ఎవ్వరూ లేరు. కంచంలోని పదార్థాలన్నీ తలాకొంచెం కడుపులోకి పోనించి, మజ్జిగ నీళ్లతో మరికొంచెం తిని భోజనం పూర్తయిందనిపించాడు నీలకంఠశాస్త్రి.

కంచం ముందునుంచి లేచి మంచం మీద నడుం వాల్చాడు శాస్త్రి.

కొడుక్కి పెళ్ళి చేస్తేనయినా బాధ్యత తెలుసుకుంటాడేమోనన్న ఆలోచనతో శాస్త్రికి పెళ్ళిచేయసంకల్పించారు తల్లితండ్రులు. అయినవాళ్ల ప్రోత్సాహం కొంత, అమ్మ నాన్నలకు మిగిలిన చిరుఆశ కొంత కారణం కాగా మహాలక్ష్మితో శాస్త్రి పెళ్ళి జరిపించారు. అణుకువగా, అమాయకంగా, వినయంగా, బిడియంగా వుండే మహాలక్ష్మి శారీరకంగా శాస్త్రి అవసరాలు తీర్చగలిగిందేకానీ అతని ప్రవర్తనలో మార్పు తీసుకురాలేకపోయింది. పాపం మహాలక్ష్మి అతని బలహీనతల్ని, బద్ధకాన్ని బలవంతంగా భరించింది, సహించింది.

పెళ్ళి చేసిన సంబరం ఎంతోకాలం నిలవలేదు చేసినవారికి, చేసుకున్న మనిషికీ కూడా. ఆకలి వేసినప్పుడు కంచం ముందుకు, ఆవలింతలు వచ్చినప్పుడు మంచం మీదకు, తోచనప్పుడు వూరి మీదకు వెళ్ళే నీలకంఠశాస్త్రి విచిత్ర ప్రవృత్తి మహాలక్ష్మిని కలవరపెట్టినా కడుపులోనే దాచుకున్నది తన కలవరపాటునంతా.

సంపాదించటం చేతకాకపోతేనేం సంసారం చేయగలిగాడు శాస్త్రి. ఏడాదికి ఒక్కోడు చొప్పున అయిదుగురు పిల్లలకు తల్లిని చేశాడు మహాలక్ష్మిని. వారి ఆలనా పాలనా మాత్రం పాపం ఆ పిచ్చి తల్లిదే. భర్తతో కలిసి తనకి ఆరుగురు పిల్లలనుకుని సరిపుచ్చుకున్నది మహాలక్ష్మి.

కొడుకు పనికిరానివాడుగా తయారయ్యాడన్న మనోవేదనతో మంచంపట్టి పరలోకానికి పయనమైపోయింది నీలకంఠశాస్త్రి తల్లి. ఆమె నగలను అమ్మి అంత్యక్రియలు ఘనంగా జరిపించాడు శాస్త్రి తండ్రి. మిగిలిన వున్న కొద్దిపాటి ఆస్తినన్నా ఎలాగో సద్వినియోగం అయ్యేటట్లు చూడాలని తహతహలాడేడు తండ్రి.

ఎవరెన్ని పాట్లు పడుతున్నా తను మాత్రం పనీ పాట లేకుండానే కాలం దొర్లించేశాడు నీలకంఠశాస్త్రి. కాలచక్రంలో సంవత్సరాలు దొర్లిపోయినయ్.

''వర్షం తగ్గినట్లున్నది. అశోక్‌ని ట్యూషన్లోదింపి రండి. ఉదయంనుంచి గొడవ తప్ప పుస్తకం తెరవలేదు'' చెప్పింది కోడలు.

మనవడ్ని ఎత్తుకుని ట్యూషన్ మాస్టరు ఇంటికి బయలుదేరేడు నీలకంఠశాస్త్రి. నిజానికి వాడిని ఎత్తుకుని వెళ్ళే శక్తి లేదాయనకు. నడిపిస్తే బురదలో పడతాడేమోనన్న భయం, గుడ్డలు పాడుచేసుకుంటాడేమోనన్న అనుమానంతో సహజంగా వుండే ప్రేమవల్ల వాడ్ని అలా మోసుకుంటూ వెళ్ళాడు శాస్త్రి. వాళ్ళ పిల్లల బాధ్యత వారు చూసుకుంటుంటే కాసేపు పిల్లల్తో ఆడుకుని, ఆడించగలడేగానీ ఏకంగా నాలుగయిదు గంటలు పిల్లలగోల భరించే సహనంగాని, వారిని ఎత్తుకుతిప్పే శక్తిగానీ లేవు నీలకంఠానికి. అయినా అప్పుడప్పుడూ అలాంటి శక్తికిమించిన పనులు చేయక తప్పదు. అలా కానప్పుడు తనమీది కోపాన్నంతా పిల్లల మీద చూపి వాళ్ళని చావగొడుతుంటుంది కోడలు

మనవడు అశోక్‌ని ట్యూషన్లో దింపి అలవాటు ప్రకారం అలా శివాలయానికి వెళ్ళి కూర్చున్నాడు నీలకంఠశాస్త్రి. ఆలయానికి వచ్చిన భక్తులెవరయినా కొబ్బరి చిప్పో, అరటిపండో ఇస్తే ఇంటికి పట్టుకువెళ్లడం, ఇంటికి చేరగానే పిల్లలు ఆయన చేతిలో ఉన్న పండో, మరోటో లాక్కుని తినేయడం యాంత్రికంగా జరిగిపోతుంటయ్.

తిన్నంత పారవేసిన రోజులన్నీ గడిచిపోయినై. ఆస్థంతా హరించుకుపోయింది. సంపాదన లేదు. తెలీదు. అయిదుగురు పిల్లలు, భార్య, ముసలి తండ్రి, తనతోసహా ఎనిమిది మంది బ్రతకాలి. రోగాలు, నెప్పుల్తోపాటు వదలని వ్యసనాలు. డబ్బుకు దూరం అయిన కొద్దీ స్నేహాలు క్రమక్రమంగా దూరంకావటం గ్రహించాడు నీలకంఠం. ఇల్లు గడవడం కష్టమయిపోయింది. మొదటినుంచీ అలవాటులేని పనేమో శరీరం శ్రమకి ఓర్చుకోలేకపోయింది. మహాలక్ష్మి గడపదాటింది. ఆ ఇంట ఈ ఇంట వంటలు చేయటం ప్రారంభించిందే కానీ తనని మాత్రం పని చెయ్యమని గాని, చేయకపోతే ఎలా అని గాని ఒక్కరోజు కూడా నిలదీయలేదు. నిష్ఠూరాలు పలకనూ లేదు. కాని అందుకు నీలకంఠం గర్వపడలేదు. సిగ్గుపడ్డాడు కాని పనిచేసేందుకు ఇన్ని సంవత్సరాలకి మానసికంగా సిద్ధపడ్డాడే గాని శరీరం ఆయనకు సహకరించలేదు.



## కష్టం

"నాకిపుడు మూడోనెల. ఈసారి అబ్బాయినే కంటాను" సంబరంగా చెప్పింది జయ, లేడీ డాక్టర్‌తో.

"సారీ జయా! నీకెలా చెప్పాలో అర్థం కావడంలేదు."

"అంటే ఈ కాన్పు జరిగితే నేను బ్రతకడం కష్టమంటారా?"

"అవును నీకు తెలీకుండా మీవారు రెండేళ్ళక్రితమే వేసక్టమీ చేయించుకున్నారు" చెప్పింది లేడీ డాక్టర్.

—గద్దం వెంకటేశ్వర్లు (ఒంగోలు)

పిల్లలంతా పెద్దవాళ్లయ్యారు. శాస్త్రి తండ్రి — పరబ్రహ్మం బాధ్యత మీదనే కూతుళ్ళు ఇద్దరికీ పెళ్ళిళ్ళు పూర్తిచేశారు. తరువాత ఇద్దరు కొడుకులు, పెద్దవాడు గోపాలం మొదట్లో పేపర్‌బాయ్‌గా పనిచేసి తర్వాత్తర్వాత ఎలాగో కష్టపడి ఓ ప్రైవేటు ఉద్యోగంలో స్థిరపడ్డాడు. చిన్నవాడు శంకరం ఇల్లు వదిలి వెళ్ళి చాలాకాలం అయింది. ఎక్కడ వున్నాడో, ఎలా వున్నాడో కూడా తెలియదు. ఆఖరు ఆడపిల్ల కావేరి ఇటీవలే ఎదురింటి టైలర్ కుర్రాడితో వెళ్లిపోయింది

ఏం జరిగినా నిర్లిప్తంగా ఉండిపోవటంతప్ప మరేమీ చేయలేని నిస్పృహాయ స్థితిలో నీలకంఠం. ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసిన కొద్ది కాలానికే శాస్త్రి తండ్రి మరణించాడు.

ఇల్లు గడవటానికి గడప దాటిన మహాలక్ష్మి రెక్కలు ముక్కలు చేసుకుని పక్షవాతంతో మంచం పట్టింది.

వాస్తవంలోకి అడుగుపెట్టి ఆలోచన మొదలుపెట్టేసరికి తన పరిస్థితి ఏమిటో అర్థమయింది నీలకంఠానికి. పెద్ద సంసారం. బాధ్యత తీసుకోని తండ్రిగా, నైతిక విలువలు పాటించని భర్తగా, ఎలా చూసుకున్నా తప్పులన్నీ తనవిగానే కనిపించినై నీలకంఠానికి

పశ్చాత్తాప పడినా ప్రయోజనం లేదు. సమయం మించిపోయింది. పరిస్థితులు చేయి దాటిపోయినై. తన స్థితి తనకే తెలియకుండా ఉంది.

ఆత్మీయులనేవారు ఎవరన్నా వుంటే మంచానపడిన మహాలక్ష్మి ఒక్కర్తే. వైద్యం లేక, అనువైన ఆహారం లేక, మందులేని మనోవ్యాధితో తనువు చాలించింది ఆమెకూడా. మొట్టమొదటిసారిగా భోరున ఏడ్చాడు నీలకంఠం. కష్టాలన్నీ కడుపులోనే దాచుకుని గుట్టుగా కాపురం చేసిన అర్ధాంగి అర్ధాంతరంగా తనని ఒంటరిని చేసి వెళ్లాక ఆత్మీయతకి, అనురాగానికి కరువున పడిన నీలకంఠం ఆలస్యంగా కళ్ళు తెరిచాడు.

ఈ ప్రపంచంలో నా అనేవారు లేని ఒంటరిననే భావన ఆయన్ని కృంగదీసింది. ఏ ఒక్కరికి అభిమాన పాత్రుడు కాలేకపోయాడు నీలకంఠం. వాస్తవంలోకి అడుగుపెట్టి పరిస్థితుల్ని అవగాహన చేసుకునేటప్పటికి చేయిదాటిపోయింది పరిస్థితి.

పెద్దకొడుకు గోపాలం ప్రభావతిని ప్రేమించి గుడిలో పెళ్ళి చేసుకువచ్చాడు. స్వయంకృషితో ఓ స్థిరత్వాన్ని ఏర్పరచుకున్న గోపాలం అంటే నీలకంఠానికి ప్రత్యేకమైన ప్రేమ. అందుకే నిండు మనసుతో కొత్త దంపతుల్ని ఆశీర్వదించాడు. కొత్తలో కోడలు తనపట్ల కొంత సానుభూతిగానూ, కొంత గౌరవంగానూ ఆదరించిన మాట నిజమే అయినా ఆ కుటుంబంలో సుఖసంతోషాలు అనుభవించే అవకాశం లేదని గ్రహించింది కాబోలు అప్పట్నుంచీ ఆయనంటే అదోరకం ఏహ్యాభావాన్ని పెంచుకుంది

చచ్చేందుకు ధైర్యం చాలక, బ్రతికేందుకు మనసు కుదరక, అందరికీ భారంగా, హీనంగా బ్రతుకీడుస్తున్నాడు నీలకంఠం. ఆలస్యంగానైనా పశ్చాత్తాపం మొదలయ్యింది ఆయనకు. ఇంతకాలం బ్రతికిన బ్రతుక్కు సిగ్గుపడుతున్నాడు నీలకంఠం. గత జీవితం తలుచుకున్నప్పుడల్లా సిగ్గుగానూ, నామర్దాగానూ అనిపించటం నీలకంఠాన్ని కొత్తగా

ఆలోచింపచేసింది. ఆయనలో అదోరకం ఆరాటం, అలజడి. తనకే తెలియని ఓ విచిత్ర ధోరణిలో పడ్డాడు నీలకంఠం.

ప్రతిరోజూ ఉదయాన్నే కాలకృత్యాలు తీర్చుకుని అలా శివాలయానికి వెళ్ళి కూర్చోవడం అలవాటు చేసుకున్నాడు చాలాకాలంగా నీలకంఠం.

మూడురోజుల్నుంచి పట్టిన ముసురు వదలడంతో అలవాటు ప్రకారం శివాలయానికి వెళ్ళి కూర్చున్నాడాయన.

"నీలకంఠంగారూ కులాసానా" పలకరిస్తూనే పక్కన కూర్చున్నాడు పరమేశ్వరశాస్త్రి — నీలకంఠం పడుతున్న బాధలు, ఆయన పరిస్థితి తెలిసినవాడు.

"ఆ... ఈ వయసులో ఆరోగ్యం ఎలా వుంటుంది. ఏదో కాలక్షేపం" నిర్లిప్తంగా చెప్పేడు నీలకంఠం.


"మీరు ఏమీ అనుకోనంటే ఓ చిన్నమాట. మీ ఇబ్బందులు ఏవో కొద్దోగొప్పో తెలిసినవాడ్ని. కానీ వాటిని అలుసుగా తీసుకుని ఇలా అడుగుతున్నాననుకోకండి... ఇది మీరు అవమానకరమని భావించనంటేనే... నాకో చిన్న సహాయం చేయాలి" అర్థింపుగా అడిగాడు పరమేశ్వరశాస్త్రి.

"అలాంటి అనుమానాలేం పెట్టుకోకండి. నాకు చేతనయిన సహాయం తప్పకుండా చేస్తాను" అనునయంగా అన్నాడు నీలకంఠం

"మా బంధువొకాయనకు ఆరోగ్యం సరిగా వుండటం లేదు. గ్రహదోషం వుందని చెప్పటంతో నవగ్రహ జపాలు, పూజలు, గ్రహశాంతి కోసం దానాలు, అభిషేకాలు జరిపిస్తున్నారు. అన్నీ సక్రమంగానే జరిగిపోతున్నాయ్ కాని శనిదానం తీసుకునేందుకు మనిషి దొరకలేదు. మీకు అభ్యంతరం లేకపోతే..."

ఇందుకా మీరు అంతగా దిగులుపడుతున్నారు. ఈ మాట అడగటానికా ఇంతగా సంకోచించటం. ఆ దానం ఏదో నేను తీసుకుంటాను. మీరు నిశ్చింతగా ఉండండిక" నిశ్చలంగా చెప్పాడు నీలకంఠశాస్త్రి.

"కానీ తిలా దానం అంటే..." నసిగా



## గుమ్మటం స్టేడియం

పెల్యూస్టన్ (టెక్సాస్'లో నిర్మించబడిన గొప్ప స్టేడియం చుట్టూ పెద్ద గుమ్మటం లాంటిది కప్పి ఉంటుంది. ఆటల పోటీలను చూసేందుకు ఈ స్టేడియంకు ఎంతోమంది వస్తుంటారు. 'బేస్‌బాల్' చూసేందుకు 45వేల మంది, ఫుట్‌బాల్ ఆటని 53 వేలమంది, ఇతర ఆటలకు 65వేలమంది ఇందులో ప్రవేశించి చూచి ఆనందించేందుకు చక్కని వసతి ఉంది.

—ఎస్.రమేశ్ చక్రవర్తి

డు పరమేశ్వరశాస్త్రి.

"చూడండి బాబు ఈ అరవై ఎనిమిది సంవత్సరాల వయసులో ఈ తిలాదానం తీసుకోవటం వలన నాకు కలిగే కీడు, దుఃఖం ఏమీ వుండవు. ఒకవేళ వున్నా అందుకు నేను సిద్ధంగా వున్నాను."

"జీవితంలో ఇంతవరకు ఎవ్వరికీ ఏ రకంగానూ ఉపయోగపడని వ్యర్థ పదార్థాన్ని నేను. నాకు శాస్త్రాలు తెలియవు. ఉపనిషత్తులు తెలియవు. ఈ దానం నేను తీసుకోవటం మూలంగా అతని ఆరోగ్యం బాగుపడుతుందనేది మీ నమ్మకం అయితే ఆ దాన ఫలం అనుభవించేందుకు నాకు ఎటువంటి అభ్యంతరం లేదు. ఈ రకంగా నావల్ల మరో మనిషికి మేలు జరుగుతుందనుకుంటేనే నాకు పరమానందంగా వుంది. దయచేసి ఈ అవకాశం నాకే కల్పించండి. నాకు మీరు మహోపకారం చేసినవారవుతారు. మీపట్ల సర్వదా కృతజ్ఞతతో ఉంటాను" అని పరమేశ్వరశాస్త్రి రెండు చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు నీలకంఠం.

"చాలా సంతోషం. అంతకంటేనా" అంటూ శెలవు తీసుకున్నాడు పరమేశ్వర శాస్త్రి.

మరి కాసేపు ఆలయంలోనే కూర్చున్నాడు నీలకంఠం. అవ్యక్తానందం ఏదో ఆయన్ను మైమరిపిస్తున్నది. మొదటిసారి జీతం అందుకోబోయే యువకుడిలా వుందాయన పరిస్థితి. ఇంట్లో ఎవ్వరికీ ఈ విషయం చెప్పదలుచుకోలేదు.. ఇల్లు గడవటానికి రేపు తనూ కొంత సహాయ పడబోతున్నాననే భావన ఆయనకు తృప్తిని కలిగించింది. ఎప్పుడూ లేని కొత్త ఉత్సాహంతో ఇంటిదారి పట్టాడు నీలకంఠశాస్త్రి.

ఆ ఆనందంలో అన్నం సరిగా తినకుండానే నిద్రరాకపోయినా తెల్లవారేందుకు ఎదురుతెన్నులు చూస్తూ మంచం మీదకు చేరేడు నీలకంఠం.

తెల్లవారింది. హడావిడిగా స్నానాదులు ముగించుకుని శివాలయం చేరుకున్నాడు. ఓ పదినిమిషాల తర్వాత వచ్చిన పరమేశ్వరశాస్త్రితోపాటు బయల్దేరాడు నీలకంఠం.

ఆ ఇంట్లో చాలామంది జనం వున్నారు. దాన ధర్మాలకోసం వచ్చిన బ్రాహ్మణులు, వేదమంత్రాల ఘోష, జపాలు, అభిషేకాల్తో ఆ వాతావరణం అంతా పూజాది కార్యక్రమాల్తో మానసికానందాన్ని కలుగచేసేదిగా వుంది. నీలకంఠశాస్త్రికి అలాంటి వాతావరణం కొత్త. ఎవరు ఏం చేయమంటే అది చేయడమే తప్ప అనుభవం లేదు. ఓ పక్కగా కూర్చున్నారు. రకరకాల దానాలు ఇవ్వబడుతున్నై. ఒక్కొక్కరే వెళ్ళి అందుకుంటున్నారు. వారు చేస్తున్న పన్లను నిశితంగా పరిశీలిస్తూ కూర్చున్న నీలకంఠం పరమేశ్వర శాస్త్రి పిలుపుతో లేచి వెళ్లాడు. అక్కడ కూర్చున్న దంపతులకెదురుగా వున్న పీటమీద కూర్చున్నాడు. ఆయన ముందు విస్తట్లో బియ్యం, నల్లనువ్వులు, నల్ల జాకెట్టు గుడ్డ, దక్షిణ, తాంబూలం పెట్టి ఉన్నయ్.

"ఈ పదార్థాల్లోని నలుపు శనికి, పీడకి ప్రతిరూపమా! వాటిని నాకు దానం ఇవ్వటం — తద్వారా వాళ్ల బాధల్ని నాకు సంక్రమింపజేస్తున్నట్టా!" మనసులోనే అనుకున్నాడు.

"కాళ్ళు పట్టండి" అంటూ ఆయన పాదాలను ఓ పళ్ళెంలో ఉంచి కడిగారు. ఆ నీటిని తమ శిరస్సుపై చల్లుకున్నారు దంపతులు. ఆ పదార్థాలన్నీ వుంచిన విస్తరిపై మరో విస్తరివేసి నీలకంఠానికి అందించారు దంపతులు.

"శివాలయానికి వెళ్ళి స్నానం చేసిరండి, భోజనం చేద్దురుగాని" చెప్పేడు పరమేశ్వర శాస్త్రి.

శనిదానం తీసుకుని నేరుగా ఇంటికి వెళ్లకూడదట, ఏ చెరువులోనో, ఆలయం లోని బావిదగ్గరో స్నానం చేయాలట. వారు చెప్పినట్లే శివాలయంలో నూతిదగ్గర స్నానం పూర్తి చేసుకుని తిరిగి వచ్చాడు నీలకంఠం.

"బాగా ఎండగా వుంది. ముందొక గ్లాసు మజ్జిగ తీసుకోండి. పెద్దవారు... అసలే భోజనానికి ఆలస్యం అయ్యింది కూడా పాపం" నొచ్చుకున్నాడు ఇంటి యజమాని.


అంతలోనే మజ్జిగ గ్లాసుతో ప్రత్యక్షం అయింది ఆ ఇల్లాలు.

"ఈ మాత్రం శ్రద్ధ, కష్టం—సుఖం నా గురించి నా కొడుకూ కోడలు ఆలోచిస్తే ఎంత బాగుంటుంది" మనసులోనే అనుకుంటూ గ్లాసు ఖాళీ చేశాడు నీలకంఠం.

శనిదానానికి వచ్చినవాడు అని నిర్లక్ష్యంగా చూసే చూపులు, జాలి చూపులు, తనను గురించిన గుసగుసలు, తనతో అవసరం తీర్చుకుంటున్న ఆ గృహ యజమానులు తప్ప మిగిలినవారంతా తనను వెలివేసినట్లు చూస్తున్నారు. అన్నింటిని మౌనంగా భరిస్తూ కూర్చున్నాడు నీలకంఠం.

భోజనాలు వడ్డించారు. నీలకంఠానికి ఆకలిగావుంది. ఆత్రంగానూ ఉన్నది. అసలు అన్నిరకాల అనుపాకాల్తో అన్నంతిని ఎంతకాలం అయిందో. అన్నువైన భోజనం కోసం అలమటించిన రోజులెన్నో. ఏదోటి పెడితే చాల్లెమ్మని ఎదురుచూసిన రోజులు ఎలా మరువగలడతను.

"ఇవన్నీ తినగలవా! తింటే హరించుకో



గలనా! ఆబగా తినేసి ఏ అజీర్తి వ్యాధో వస్తే ఇంట్లో అందర్నీ మరింత బాధపెట్టిన వాడ్ని అవుతానేమో! నాపట్ల ఇంకా జుగుప్సని, ఏవగింపుని పెంచుకోవటం అవుతుందేమో'

మనసులో అనుకుంటూనే భోజనానికి ఉపక్రమించాడు నీలకంఠం. జిహ్వాచాపల్యమే జయించింది. సుష్టుగా భోజనం చేసి తృప్తిగా లేచాడు నీలకంఠం.

తాంబూలంలో తాను అడక్కుండానే మరో పది రూపాయలు అదనంగా ఇచ్చారు. పరమేశ్వరశాస్త్రికి, ఇంటి యజమానికి చెప్పి అక్కడ్నుంచి బయల్దేరిన నీలకంఠం దారిలో పిల్లలకు తినే వస్తువులు ఏవో కొన్నాడు. ఓ పది రూపాయలకు కూరలు కొని హుందాగా అడుగులు వేసుకుంటూ ఆలోచించుకుంటూ ఇంటిదారి పట్టాడు.

"అందరూ పీడ అని, వదిలించుకోవాలని, చీదరించుకునే శని నాకు మహోపకారం చేశాడు. సంపాదన లేదని, బాధ్యతలు నిర్వర్తించ లేదని నిష్ఠూరాలు, నిందలు, హేళనలతో విసిగిపోయిన నాకు మర్గదర్శకుడయ్యాడు శని" మనసులోనే అనుకుంటూ ఇంటికి చేరేడు.

ఆ రోజు సాయంత్రమే పరమేశ్వర శాస్త్రిని కలుసుకున్నాడు నీలకంఠం. ఎప్పుడైనా ఇలాంటి అవకాశాలు వస్తే తప్పకుండా తనకే చెప్పమన్నాడు. అంతేకాదు జాతకాలు చూడటం, గ్రహశాంతులు చేయడంలో ప్రవేశము, ప్రావీణ్యత ఉన్న పరమేశ్వరశాస్త్రికి నీలకంఠానికి ఈ దానధర్మాల విషయంలో ధర్మాధర్మాలకు తావులేని విధంగా ఓ ఒప్పందం కూడా జరిగింది. ఉభయులకూ లాభసాటి మార్గాన్ని ఎన్నుకుని ఆచరణలో పెట్టేందుకు ప్రణాళికను రూపొందించుకున్నారు.

పరమేశ్వరశాస్త్రితో జరిపిన సంభాషణను తలుచుకుంటూ పడుకున్న నీలకంఠానికి ఆ ఆనందంతో చాలాసేపు నిద్రపట్టలేదు.

తెల్లవారాక మామూలుగా శివాలయానికి వెళ్ళి కాసేపు కూర్చుని వచ్చాడు. ఇంట్లో ఉన్న పాత పుస్తకాల దొంతర్లను తీసి శనిస్తోత్రాల పుస్తకం చేత పట్టుకున్నాడు.

"నీలాంజన సమాభాసం రవిపుత్రం యమాగ్రజం
ఛాయామార్తాండ సంభూతం తం నమామి శనైశ్చరం"

కంఠతావచ్చేవరకు పట్టువదలకుండా కంఠస్థం చేయసాగాడు నీలకంఠం.

"దానాలు తీసుకునేది కాక రోజూ ఇంట్లో శని ప్రార్థనలు కూడానా, పాడుగోల. ఇదెక్కడి శనంట నాకు" కసురుకుంది కోడలు.

ఆయన తీసుకునే శనిదానాలు, తనని, పిల్లల్ని, భర్తని పట్టి బాధిస్తాయేమోనన్న భయం పట్టుకున్నదామెను. ఆ భయాన్నంతా బయటపెట్టింది నీలకంఠం మీద కోపం రూపంలో. తండ్రిని వారించలేక, అడగకుండా వుండలేక సతమతమైపోతున్నాడు కొడుకు — గోపాలం.

ఎవరేమనుకున్నా ఈ పని మానదలుచుకోలేదు నీలకంఠం. "ఇప్పటికైనా నా బాధ్యత నాలుగురాళ్ళు వేనకేసుకోవడమే. అవి చూసే ఎవరైనా ఆశ పడేది, అపేక్ష చూపించేది. ఇన్నాళ్ళూ కళ్ళున్న గుడ్డివాడిలా

ప్రవర్తించాను. ఇకనైనా మేల్కొని నా మేలు నేను చూసుకోవలసిందే'' మనసులోనే గట్టిగా నిర్ణయించుకున్నాడు నీలకంఠం.

''అమ్మా ప్రభావతి'' కోడల్ని పిలిచాడు నీలకంఠం. ఏమిటన్నట్లు విసురుగా, విసుగ్గా చూసిందామె.

''చూడమ్మా ఇకనుంచీ ఈ శని— అదేనమ్మ నేనిక ఈ ఇంట్లో ఉండబోడం లేదు. ఈ రోజునుంచీ నీకు ఈ శని పీడ వదిలిపోతున్నది. నేను ఇకనుంచి శివాలయంలోనే పడుకోవడానికి నిశ్చయించుకున్నాను. భోజనం సంగతి... నీకు తెలిసిందేగా... భోక్తగా వెళుతుంటాను. నాతో అవసరం అయితే తప్పక మీ అందరికీ సహాయపడతా. పిల్లల్ని జాగ్రత్తగా చూసుకో. గోపాలం... పాపం మెతకవాడు. చిన్నప్పటినుంచి వాడ్ని నేను ఏమీ పట్టించుకోకపోయినా వాడి కష్టాలేవో వాడు పడి నాకింతకాలం పట్టెడు అన్నం పెట్టాడు. మీ అందరూ సుఖంగా, సంతోషంగా ఉండటం కంటే నాకు కావలసిందేముంటుంది... వెళ్తున్నాను'' అని చెప్పి తన బట్టల్ని ఓ సంచీలోకి సర్దుకుని ఆ ఇంటినుంచి అడుగు బయటపెట్టాడు నీలకంఠం.

ఆయన నిర్ణయానికి ఆమోదమూ తెలుపకుండా నిరసనా తెలియజేయకుండా నిర్లిప్తంగా ఉండిపోయింది ప్రభావతి.

రాత్రి బాగా చీకటి పడింది. ఈ పాటికి తన విషయం కొడుకు కూడా తెలుసుకునే ఉంటాడు. అయినా ఆయనకోసం రాలేదు.

ఓ పంచె తీసి నేలమీద పరుచుకుని సంచి తలక్రింద పెట్టుకుని శివాలయ మండపంలో మేను వాల్చాడు నీలకంఠం. ఆలోచనలతో నిద్రరావటం లేదు.

ఇంతలో—

పోనీ, పోనీ, పోతేపోనీ, సతుల్, సుతుల్, హితుల్, పోనీ పోతే పోనీ.

రానీ, రానీ, వస్తే రానీ, కష్టాల్, నష్టాల్, కోపాల్, తాపాల్, శాపాల్, రానీ వస్తే రానీ, తిట్లూ, రాట్లూ, పాట్లూ, రానీ అని పెద్దగా రాగయుక్తంగా పాడుకుంటూ రోడ్డుమీద వెళుతున్నాడో యువకుడు.

మహాకవి మాటల్ని మళ్లీ మళ్లీ మననం



## ఒప్పుకోదు

స్నేహితునితో చెపుతున్నాడు హరి
''ఓ గొప్పింటి పిల్లను పెళ్లి చేసుకుంటే నా ఆర్థిక ఇబ్బందులన్నీ తీరిపోతాయి!''
''పోనీ అలాగే చేసుకోవచ్చుగా'' సలహా ఇచ్చాడా స్నేహితుడు.
''మా ఆవిడ ఒప్పుకోదేమరి!''
''ఆ...!''

—కె. శ్రీశైలం (మహబూబ్‌నగర్)

చేసుకున్న నీలకంఠం కృతనిశ్చయంతో, నూతనోత్సాహంతో, సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో తృప్తిగా నిద్రపోయాడు.

మర్నాటినుంచి పరమేశ్వర శాస్త్రితో అనుకున్న ప్రకారం తిలా దానాలు తీసుకోవడం, దక్షిణ తాంబూలాలను స్వీకరించటం, వచ్చిన దానిని వాటాలుగా విభజించుకోవటం ప్రారంభించాడు నీలకంఠం.

అలాంటి సందర్భాల్లో పాల్గొనటానికి ఇదివరకులా బిడియపడటం, అవమానకరంగా భావించటం లేదిప్పుడు నీలకంఠం. తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకోవాలనుకున్నాడు. ఆ ప్రయత్నాన్నే ప్రారంభించాడు. తీరిక వేళల్లో తనకి ఈ రంగంలో పనికివచ్చే పుస్తకాల్ని చదువుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు.

దక్షిణ తాంబూలాల్తోపాటు అడపదడప నూతన వస్త్రాలుకూడా లభిస్తున్నయ్ నీలకంఠానికి. కేవలం దానాలు తీసుకునేందుకే కాకుండా పరమేశ్వరశాస్త్రి పలుకుబడి మూలంగా రెండో భోక్తగా వెళుతూ భోజనానికి లోటులేకుండా చూసుకుంటున్నాడు నీలకంఠం.

పూజా విధానాన్ని, అష్టోత్తర నామాల్ని, రకరకాల శ్లోకాలను, స్తోత్రాలను నేర్చుకున్నాడు. మెళుకువలు తెలుసుకున్నాడు. లౌక్యం నేర్చుకున్నాడు.

ఇప్పుడు నీలకంఠ శాస్త్రికి బ్రతకాలనిపిస్తున్నది. తన బతుక్కి సార్థకత కనిపిస్తున్నది. సోమరితనంలో వున్న నష్టాలు, కష్టాలు తెలుసుకున్నాడు. ఇంతకాలం జీవితం వృధా చేసుకున్నందుకు పశ్చాత్తాపం కలిగిందాయనకు.

ఎప్పుడూ ఏదో ఒక వ్యాపకంలో మునిగిపోయి ఉండటంలో ఉండే ఆనందం, హాయి అనుభవిస్తున్నాడు నీలకంఠం.

నీలకంఠ శాస్త్రికి ఇప్పుడు ఉన్న వూళ్లోనే కాక చుట్టుప్రక్కల గ్రామాల్లోకూడా బోల్డంత గౌరవం, మర్యాద, అభిమానం, ఆయన పేరంటే చాలు చేతులెత్తి నమస్కారం చేసే వాళ్లు చాలామంది తయారయ్యారు.

అసలు శాస్త్రి రూపురేఖలే మారిపోయినై నీరుకాయ పంచలు కట్టుకు తిరిగిన నీలకంఠం ఇప్పుడు పట్టువస్త్రాలు తప్ప కట్టటం లేదు. నుదుటన విభూతి రేఖల్తో వింతకాంతితో మెరిసిపోతున్నదాయన ముఖం. రోజూ రెండు పూటల కడుపునిండా తృప్తిగా భోజనం సమకూరటం వల్లనూ, ఆయనతో పనుండి వచ్చేవారు తెచ్చే పండ్లు వగైరాలకు లోటులేకపోవటం చేతనూ సన్నగా, పీలగా ఉండే నీలకంఠశాస్త్రి ఒళ్ళు చేశాడు. వీటన్నింటిని మించి నేనూ సంపాదనపరుడ్ని కావటమే కాదు ఆస్థిపరుడ్నికూడా అయ్యానన్న అతిశయం, గర్వం ఆయన ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంటయ్.

తెల్లవారి లేచింది మొదలు శివాలయంలో అర్చనలు, అభిషేకాలు, జపాలు, హోమాలు, శాంతులు, దానాలు వగైరా వగైరా అధ్యాత్మిక విషయాల్లో క్షణం తీరికలేకుండా మునిగిపోయి ఉంటున్నాడు నీలకంఠశాస్త్రి. అతని నోట్లోనుంచి వచ్చే మంత్రోచ్ఛారణ విని పులకితులయ్యే వారు ఎందరో. అతని దర్శనం చేసుకున్నామని తన్మయుల

య్యేవారు ఎందరో. ఆయన్తో సంభాషణ జరిపాలని ఉవ్విళ్ళూరేవారు ఎందరో!

చిన్న చిన్న సంభావనల్తో పని లేదిప్పుడు నీలకంఠశాస్త్రికి. ఆయనను భరించే తాహతు అందరికీ ఉండదు. అయినా ఎవర్నీ నొప్పించకుండా, తనకు నష్టం లేకుండా జాగ్రత్తపడుతూ సాధ్యపడినంతవరకు సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు నీలకంఠశాస్త్రి. అయినవాడ్ని అవసరాల్లో ఆదుకునే స్థితికి ఎదిగాడాయన ఇప్పుడు.

ఇంట్లో ఆయన ఉనికినే భరించలేని కొడుక్కి, కోడలికి, ఏనాడో తనకి దూరమైన మిగిలిన పిల్లలకు, బంధువులకు నీలకంఠశాస్త్రి ఇప్పుడు కావలసిన మనిషి. ఆత్మీయుడు. ఆయన వచ్చి ఉంటానంటే అభ్యంతరం చెప్పేవాళ్ళు, అయిష్ట పడేవారు ఒక్కరు కూడా లేరు. అయితేనేం ఆయన ఇప్పుడు అందుకు సిద్ధంగా లేడు. తనమీద ఎవరైనా ఆధారపడినా భరించగలిగే ఆర్థిక స్థోమత, మానసిక ఔన్నత్యం సంతరించుకున్నాడాయన.

డబ్బు ఉంటేనే మనిషికి విలువ అనే నిజం గ్రహించినా కుటుంబ బాధ్యతల్ని ఏమాత్రం పట్టించుకోని తన నిర్లక్ష్య ధోరణికి, కొడుకుగా, భర్తగా, తండ్రిగా ఏరకంగానూ ఎవ్వరికీ ఉపయోగపడని తను ఇప్పుడిలా అందరి మన్ననలు పొందుతూ, తన జీవితానికి అర్థం, పరమార్థం చేకూరినయ్యన్న తృప్తి ఆయనకు నూతనోత్సాహాన్ని కలుగచేసింది.

ఆలస్యంగానైనా చేసిన పొరపాట్లకు పశ్చాత్తాప పడి ప్రయోజకుడైన నీలకంఠశాస్త్రి తన బాధ్యతలను ఇకనైనా సక్రమంగా నిర్వర్తించేందుకే నిర్ణయించుకున్నాడు.

అందరూ వదిలించుకోవాలనుకునే శనిగ్రహమే ఆయన పాలిట అనుగ్రహం చూపాడు.

*



## ఇన్సులిన్ కాప్స్యూల్స్

మధుమేహ వ్యాధి పీడితులు అయిన వారికి ప్రస్తుతం ఇన్సులిన్ తీసుకోవాలంటే ఇంజక్షన్ ద్వారానే తీసుకోవాలి. ఇటీవల సోవియట్ బయోకెమిస్ట్ కొందరు ఇన్సులిన్‌ను పౌడర్ రూపంలో రూపొందించారు. కాప్స్యూల్స్ రూపంలో ఇన్సులిన్ పౌడర్‌ను మింగేందుకు వీలుగా రూపొందించి, లేబరేటరీలో పరీక్షలు జరిపి సత్ఫలితాలను పొందారు. అతి త్వరలో మార్కెట్‌కు ఈ కాప్స్యూల్స్‌ను తీసుకొచ్చేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి రష్యాలో.

—ఎస్.రమేశ్ చక్రవర్తి